క్లుప్తంగా

చిన్నారులకు అక్షరాభ్యాసం



డబ్ల్యూ గోవిందిన్నెలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ నిర్వహించి చిన్నారులతో పలకపై ఓనమాలు దిద్దించారు. అలాగే ఐదేళ్లు పూర్తయిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేరుస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తెలిపారు. అనంతరం చిన్నారులు, తల్లులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన పశువైద్యాధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న పశువైద్యాధికారి చిన్నబాబు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడు పశువైద్యశాల వైద్యాధికారిగా చిన్నబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లె మండలం టంగుటూరు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇన్నాళ్లుగా ఇక్కడ ఇన్‌చార్జ్‌గా క్రిష్టకుమార్ విధులు నిర్వహించారు. ప్రస్తుతం రెగ్యులర్ డాక్టర్ నియామకంతో పాడిపెంపకం దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఓగా శ్రీనివాసరెడ్డి

మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా శుక్రవారం శ్రీనివాసులు రెడ్డి విధుల్లో చేరారు. అలాగే ఇక్కడ ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న సులోచన పాములపాడుకు బదిలీ అయ్యారు. ఈఓపీఆర్డీగా కొలిమిగుండ్ల మండలం నుంచి శివప్రసాద్ వస్తున్నట్లు సమాచారం. ఈయన రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ఉయ్యాలవాడ ఏఓగా శ్రీనివాసులురెడ్డి



ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ మండల వ్యవసాయాధికారిగా శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ఈయన ప్రస్తుతం కల్లూరు మండల ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఉయ్యాలవాడ వ్యవసాయాధికారిగా ఇప్పటి వరకు పనిచేసిన రాజేంద్రకుమార్ ఆళ్లగడ్డ ఏడీఏ కార్యాలయానికి టెక్నికల్ ఏఓగా బదిలీ అయ్యారు. ఈ మేరకు వ్యవసాయాధికారులు ఉత్వర్వులు జారీ చేశారు.

యువకుడిపై వేధింపుల కేసు నమోదు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడులో అజయ్‌కుమార్ అనే ఓ యువకుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. తన వెంట పడుతూ లైంగికంగా వేధిస్తున్నట్లు శుక్రవారం ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండా గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కేంద్రంలో ముందుగా సరస్వతి పూజ నిర్వహించి, చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. అనంతరం అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో అంగన్‌వాడి కార్యకర్త బాల కుల్లాయమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే అంకాలమ్మ దేవికి పూజలు నిర్వహించారు.

మహానందిలో డ్వామా పీడీ

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో డ్వామా నూతన పీడీ సూర్యనారాయణ శుక్రవారం పూజలు చేశారు. దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగ మల్లయ్య, ఏపీఓ మల్లికార్జున స్వాగతం పలికారు. ఆయన కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనాలు చేసి స్వామి వారి ప్రసాదాలు అందించారు.

మహా విషాదానికి చిత్రాంజలి



గుజరాత్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదం మాటలకందని మహా విషాదాన్ని మిగిల్చింది. సుమారు 270 మంది ప్రాణాలు తీసుకుంది. అహ్మదాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం మెడికల్ కాలేజీపై కుప్పకూలి పేలిపోవడంతో చోటు చేసుకున్న ఈ ఘటనపై నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఊహా చిత్రం గీచారు. ప్రమాదంలో చిన్నాభిన్నమైన శరీర భాగాలు, బాధిత కుటుంబసభ్యుల ఆర్తనాదాలకు చిత్ర రూపమిచ్చి నివాళులర్పించారు. - నంద్యాల(అర్బన్)

ముక్కుమూసుకో..ఇంతేననుకో



ఇక్కడ కనిపిస్తున్న మురుగుకుంట రుద్రవరం మండలం పెద్దకంబలూరు ఎస్సీ కాలనీలోనిది. వర్షం కురిస్తే చాలు వర్షం నీటితో పాటు గ్రామంలోని అన్ని కాలనీల్లోని మురుగు అంతా ఈ కుంటలోకి వచ్చి చేరుతోంది. తర్వాత ఆ వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టుపక్కల నివసించే వారు రోగాల బారిన పడుతున్నారు. అయినా,పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి మురుగు తొలగింపు పనులు చేయించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు. -రుద్రవరం

నిప్పు..ముప్పు



మండలంలో విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పలు చోట్ల విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటం, స్తంభాలు దెబ్బతిని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందలూరులోని ఓ విద్యుత్ స్తంభం పై వాటంతట అవే మంటలు చెలరేగాయి. గాలికి కిందకు నిప్పులు రాలిపడుతున్నాయి. మంటలకు తీగలు కాలిపోయి ఎక్కడ తమపై పడుతాయోనని స్థానికులు తీవ్ర భయందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని వాపోతున్నారు. -రుద్రవరం

మోసంలో 'సూపర్ సిక్స్' కొట్టారు

- చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి ధ్వజం
- తల్లికి వందనం పేరుతో రూ. 13 వేలే ఇచ్చారని మండిపాటు



మాట్లాడుతున్న భూమా కిశోర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజలకు మోసం చేయడంలో సూపర్ సిక్స్ కొట్టారని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల్లో ప్రకటించిన నిరుద్యోగభృతి, మహిళలకు నెలకు రూ.1500, అన్నదాత సుఖీభవ హామీలను ఎం చేశారని ప్రశ్నించారు. మహిళలు ఉచిత బస్సు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించి ఇప్పుడు రూ.13 వేలు ఇవ్వడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఇంటింటికి రేషన్‌ను బంద్ చేయించి పేదలను నడిరోడ్డున పడేశారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం తప్పా మరేమి అమలు కావడం లేదన్నారు. ఇక చికెన్, ఇసుక దందాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అఖిలప్రియ ఏడాదికి 5వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఎన్నికల్లో చెప్పారని, ఇప్పటి వరకు ఎంత మందికి ఆమె ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో సోలార్ పరిశ్రమ లేకపోయినా అందులో ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. చిరు వ్యాపారుల కోసం అహోబిలంలో గేట్లు ఎత్తివేస్తామని చెప్పి ఇప్పుడు వారి నుంచే వసూలు మొదలు పెట్టారని ఆరోపించారు. కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలపై కూడా కమీషన్ కక్కుర్తి పడటం ఏమిటని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ సైతం ఎన్నికల సమయంలో పలు హామీలు ఇచ్చారని, ఇప్పుడు ఆయన వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రజాపాలన వదిలేసి షూటింగ్‌లు చేసుకుంటూ పోతే ఎలా అని డిప్యూటీ సీఎంను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలను ఏటీఎంలుగా మార్చుకున్నారని, తీరు మార్చుకోకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



కిట్లను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

శిరివెళ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్ల పంపిణీ జరుగుతుంది. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నాగార్జునరెడ్డి కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1వ తర గతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న 4,739 మంది బాల బాలికలకు విద్యా కిట్ల పంపిణీని జరిగిందన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కు లు, యూనిఫాం, బూట్లు కిట్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందరాజులు, సీఆర్పీ అన్సర్, టీచర్లు పాల్గొన్నారు.

శ్రీకాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాళికాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబాదేవికి శుక్రవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేశారు. తర్వాత వివిధ రకాల పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కాశీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరేష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూ గోవిందిన్నెలో మినరల్ వాటర్ ప్లాంటు



ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో మూలపెద్దమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు, గ్రామస్తులు సౌకర్యార్థం దాతల సాయంతో నిర్మించిన ఉచిత మినరల్ కూల్ వాటర్ ప్లాంట్‌ను మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మాయలూరు బసిరెడ్డి జ్ఞాపకార్థ ఆయన కుమారుడు విశ్వనాథ్‌రెడ్డి రూ.లక్ష, భూమా వీరభద్రారెడ్డి రూ.20వేలు, ఎల్లాల జగదీశ్వరరెడ్డి, అంబటి చంద్రశేఖర్‌రెడ్డి, పందిర్ల వెంకటసుబ్బారెడ్డి, చిన్న వెంకటసుబ్బారెడ్డి, బలపనూరు వేణుగోపాల్‌రెడ్డి, కేవీనాగిరెడ్డి, వేంపల్లె రమణమ్మలు ఒక్కోక్కరు రూ.10వేల చొప్పున, రామచంద్రారెడ్డి, సిద్దం వెంకటసుబ్బారెడ్డి రూ.5వేల చొప్పున విరాళాలు అందజేశారు. అలాగే భూమా సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి 40 కూల్ వాటర్ క్యాన్లు, డీసీ ప్రెసిడెంట్ బబ్బూరి వెంకటస్వామి 20, రెడ్డెం రమేష్‌రెడ్డి 10 క్యాన్ల చొప్పున అందజేశారు. విరాళాలు అందజేసిన వారందరినీ పెద్దమ్మ ఆలయ కమిటీ సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ కర్నాటి కృష్ణారెడ్డి, వాసు, అంజి, ప్రభయ్య, ప్రసాద్,శ్రీనివాసరెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు తగ్గిన ఆదాయం



వేలం పాటలో పాల్గొన్న అధికారులు, రైతులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని భోజనం గ్రామానికి చెందిన ముక్తేశ్వర ఆలయ భూములకు శుక్రవారం నిర్వహించిన కౌలు వేలంపాటలో ఆదాయం తగ్గిందని గ్రూపు దేవస్థానముల ఈఓ నాగప్రసాద్ తెలిపారు. 27.29 ఎకరాల భూములకు నిర్వహించిన వేలంపాటలో రూ.5.36 లక్షలు రైతులు దక్కించుకున్నారన్నారు. గత సంవత్సరంలో రూ.11.55 లక్షలు రాగా ఈ ఏడాది దాదాపు రూ.6.19 లక్షలు ఆదాయం తగ్గిందన్నారు. వేలంపాటలో నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్రరెడ్డి, ఎస్‌ఐ జగన్మోహన్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివారావు

దొర్నిపాడు: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ సాంబశివారావు సిబ్బందికి సూచించారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్‌పై అందిన ఫిర్యాదు మీద ఆయన విచారణకు వచ్చారు. ఉపాధి పనుల అవకతవకలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీలకు పెండింగ్ వేతనాలు త్వరలోనే జమ అవుతాయని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏపీడీ వెంట ఏపీఎం హనీఫా ఉన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

ఉయ్యాలవాడ : మండలంలో సాగు నీటి కింద ఆయకట్టు రైతుల నుంచి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు వీఆర్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో కేసీ కెనాల్(కుందూ), ఎస్సార్బీసీ, చెరువుల కింద 11,230 మంది రైతులు సాగు నీటిని వాడుకుంటూ పంటలు సాగు చేస్తున్నారన్నారు. మండల పరిధిలో ఆయకట్టు కింద 49,751.88 ఎకరాల భూమి విస్తీర్ణం సంబంధించి రూ. 7,87,865లు నీటి పన్ను రైతులు చెల్లించాల్సి వుందన్నారు. ఇప్పటి వరకు రూ. 78,503 రైతుల నుంచి వసూలు చేయడం జరిగిందన్నారు. ఇంకా రూ. 7,09,362 బకాయిలు ఉన్నాయన్నారు. వీటి వసూళ్లలో వీర్వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ముందుగా మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, హారతులు ఇచ్చి పల్లకీలో కొలువు తీర్చారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకీ ఉత్సవం కనులపండువగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు పల్లకీసేవలో పాల్గొని ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై శ్రీశైలానికి చెందిన ఎస్.కుమార్‌చే కూచిపూడి నృత్య కార్యక్రమం నిర్వహించారు. మూషికవాహన, వినాయక కౌత్వం, లింగాష్టకం, శివ తాండవం, శివస్తుతి, దేవీస్తుతి, పార్వతీవల్లభాష్టకం తదితర గీతాలకు, అష్ట కాలకు అమృతవర్షిణి, అక్షయ, వరలక్ష్మి, అభినయశ్రీ, రామతులసి తదితరులు నత్యప్రదర్శన చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరు కొట్టాల గ్రామానికి చెందిన సప్పోగుల సాలన్న, మద్దిలేటి, తిమోతి కలిసి పొలం దగ్గర అడ్డగించి చంపుతామని బెదిరించినట్లు అదే గ్రామానికి చెందిన రవి కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు శుక్రవారం రాత్రి తెలిపారు.

మున్సిపల్ మాజీ అధికారులకు షోకాజ్ నోటీసులు

డోన్ టౌన్: డోన్ మున్సిపల్ మాజీ కమిషనర్‌తో పాటు మరో ఏడుగురిపై అవినీతి ఆరోపణలు నిర్ధారణ కావడంతో ప్రభుత్వం షోకాజ్ నోటీలు జారీ చేసింది. 2020-21లో నగర పాలక సంస్థలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేసింది. 2024 ఫిబ్రవరి 23న విజిలెన్స్ అధికారుల నివేదిక ప్రకారం అప్పటి కమిషనర్ రమేష్‌బాబు, డీఈ వేణుగోపాల్, ఏఈలు రామ్మూర్తి, రాజునాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు షబరీష్, ప్రహ్లాద్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు లక్ష్మీసువర్ణ, రుపేష్ కుమార్‌లు బాధ్యులని ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీని ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని కోరుతూ ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 15 రోజుల్లోగా నోటీసులకు సమాధానం ఇవ్వకుంటే ప్రభుత్వ సర్వీసు రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆలయాల భద్రతకు చర్యలు



సర్వ నరసింహస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న సీఐ

శిరివెళ్ల: ఆలయాల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ దస్తగిరిబాబు అన్నారు. శుక్రవారం నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఇటీవల ఆళ్లగడ్డ మండలం పుట్లాలమ్మ గుడిలో భారీ చోరీ జరిగింది. ఈ నేపథ్యంలో సీఐ, ఎస్‌ఐ చిన్న పీరయ్య ఆలయాల భద్రతపై దృష్టి పెట్టారు. నరసింహ స్వామి ఆలయంలో ఉన్న హుండీలు, స్వామి వారి ఆభరణలపై ఈఓ నరసయ్యను ఆరా తీశారు. ప్రతి దేవాలయంలో తప్పని సరిగా సీసీ కెమెరా, వాచ్ మెన్ ఉండాలని సీఐ అన్నారు. ఆ దిశగా ఆలయాల ఈఓలు, నిర్వాహకులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మురం చేశామన్నారు. ఆదాయాలు, ఆభరణాలు గల ఆలయాల్లో నైట్ వాచ్‌మెన్ నియామకాలను తప్పని సరి చేస్తున్నామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే బోట్లు సీజ్ చేస్తాం



బోటు నిర్వాహకులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: సంగమేశ్వరం, సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిలో నిబంధనలు ఉల్లంఘించిన మరబోట్లు తిప్పితే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయ్యంలో సంగమేశ్వరం, సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాల గూడెం బోటు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణానదిపై సంగమేశ్వరం, సిద్దేశ్వరం ఘాట్ల నుంచి తెలంగాణ ప్రాంతం సోమశిలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా నడపరాదన్నారు. నడిపేవారికి తప్పకుండా బోటుకు ఇన్సురెన్స్, డ్రైవర్‌కు లైసెన్స్, లైఫ్‌జాకెట్లు, ఎక్కడి నుంచి ఎక్కడికి తిప్పుకోవాలనే విషయాలు, ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సిబ్బంది, మరబోట్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

పగిడ్యాల మాజీ జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి మృతి



రామచంద్రారెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిద్ధార్థరెడ్డి



పుల్యాల రామచంద్రారెడ్డి (ఫైల్)

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్‌సీ విద్యా సంస్థల అధినేత పుల్యాల రామచంద్రారెడ్డి(52) అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి సోదరుడు రామచంద్రారెడ్డి క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ మండలంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆర్‌సీ విద్యా సంస్థలను స్థాపించి ఎంతో మంది విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన అకాల మృతి తెలుసుకున్న విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు స్వగ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జన సందోహం మధ్య బుగ్గ వేంకటేశ్వరుని రథోత్సవం

రమణీయం.. రథోత్సవం

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన బుగ్గ వేంకటేశ్వరస్వామి మహారథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు రథోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రథం ముందు భక్తిగీతాలు, చెక్కభజనలు, స్వామివారి వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులు రథంపైకి అరటి, మామిడి పండ్లు విసురుతూ ముక్కులు చెల్లించుకున్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కొలాటాల నడుమ రథోత్సవం కనుల పండువగా సాగింది. ఎస్‌ఐ రమణయ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి

- గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శ్రీకారం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ముందుకు సాగని పనులు



శ్రీరంగాపురంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం

రుద్రవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. పూర్తిస్థాయి సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దింది. ఇదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అద్దె భవనాల స్థానంలో సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఇలా రుద్రవరం మండలంలో ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి రూ. 13 లక్షల చొప్పున 7 నూతన భవనాలకు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించింది. అయితే, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పనులకు గ్రహణం పట్టింది. ఏడాది గడిచినా చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదు. దీంతో శ్రీరంగాపురం, ముత్తలూరు, డి.కొట్టాలలోని కేంద్రాలు పైకప్పు దశలో , నర్సాపురం,పేరూ రు.కొండ మాయపల్లె గ్రామాల్లోనివి బేస్‌మట్టం దశలో నిలిచిపోయాయి. కూటమి సర్కారు ఈ పనులు పూర్తి చేయకపోవడంతో తమ పిల్లలు అరకొర వసతులు కలిగిన అద్దె భవనాల్లో మగ్గుతున్నారని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాలను కొందరు తమ వ్యక్తి గత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.



గదిలో నిల్వ చేసిన వరి గడ్డి కట్టలు